## ప్రజా సమస్యలపై ఆరా


కొబ్బరితోటలో సమస్యలపై ప్రజలతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పద్మావతి

అల్లిపురం : గురువారం కొబ్బరితోట సచివాలయం పరిధిలోని యాతపేటలో 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి పర్యటించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. 'మీ ఇంటికి మీ కార్పొరేటర్' కార్యక్రమంలో భాగంగా ఆమె వలంటీర్ హైమ, కన్వీనర్లు తాతబ్బాయి, యాసరపు రాజు, వైట్‌లతో కలిసి ప్రజలను కలుసుకుని మాట్లాడారు. ఆమె వెంట వార్డు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## డీ-వార్మింగ్ డేను విజయవంతం చేయాలి

మహారాణిపేట : జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఈ నెల 9న నిర్వహించే డీ వార్మింగ్ డేను విజయవంతం చేయాలని డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు కోరారు. రేసవానిపాలెంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గురువారం సమీక్ష నిర్వహించారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. బాల బాలికలకు అంగన్‌వాడీ, ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ మాట్లాడుతూ డీవార్మింగ్ డేను విజయవంతం చేయాలని కోరారు. ఆ రోజున స్కూళ్లకు హాజరుకాని పిల్లలకు 16న మాత్రలు అందించాలని సూచించారు. ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎస్.ప్రశాంతి కన్సల్టెంట్ హీనా దీక్షిత్, శాంతి ప్రియ, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# 'జగనన్న సురక్ష'తో ఆరోగ్య భద్రత

- దొండపర్తి యూపీహెచ్‌సీలో 468కి ఉచిత పరీక్షలు, వైద్యం, మందుల అందజేత
- హర్షం వ్యక్తం చేసిన స్థానికులు


దొండపర్తి యూపీహెచ్‌సీలో బీపీ చెక్ చేస్తున్న ఏఎన్ఎం


రిజిస్ట్రేషన్ చేస్తున్న సచివాలయ సిబ్బంది


రోగులకు ఉచితంగా మందులిస్తున్న వార్డు అధ్యక్షుడు సర్వేశ్వరరెడ్డి, ఏఎన్ఎంలు

సీతమ్మధార : జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం అని 27వ వార్డు అధ్యక్షుడు, ఎరుకుమాంబ ఆలయ ట్రస్ట్ చైర్మన్ నీలాపు సర్వేశ్వరరెడ్డి అన్నారు. వార్డులోని దొండపర్తి (యూపీహెచ్‌సీ) 141 సచివాలయం పరిధిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌ను సర్వేశ్వరరెడ్డి, పార్టీ నేతలు పర్యవేక్షించారు. సుమారు 468 మంది శిబిరంలో ఉచిత వైద్య సేవలు అందుకున్నారు. పరీక్షలు చేయించుకున్న వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ జి. శిరీష, డాక్టర్ రూప, కంటి పరీక్ష టెక్నీషియన్ అనితారెడ్డి శిబిరానికి వచ్చిన వారికి సేవలందించారు. ఈ సందర్భంగా సర్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తూ, ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నామని, ఆరోగ్యాంధ్రప్రదేశే సీఎం జగన్ లక్ష్యమన్నారు.

## 36వ వార్డులో అభివృద్ధి పనులకు శ్రీకారం


ఏవీఎన్ కాలేజీ వద్ద అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మేయర్, ఎమ్మెల్యే


రెల్లివీధిలో సామాజిక భవనానికి శంకుస్థాపన చేస్తున్న మేయర్ హరివెంకటకుమారి, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్ : అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా జగనన్న పాలన సాగుతోందని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. జోన్-4 పరిధి 36వ వార్డులో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, వార్డు కార్పొరేటర్ మాసిపోగు మేరీజోన్స్‌తో కలిసి ఆమె భూమిపూజ చేశారు. వార్డు పరిధిలో సుమారు రూ.31.80 లక్షల జీవీఎంసీ నిధులతో తారు రోడ్డు పునఃనిర్మాణానికి, రెల్లివీధి పోలమాంబ గుడి వద్ద సుమారు రూ.14 లక్షల వ్యయంతో సామాజిక భవన నిర్మాణానికి, మంతావారి వీధిలో సుమారు రూ.21.90 లక్షల వ్యయంతో సామాజిక భవనం గ్రౌండ్ ఫ్లోర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. అనంతరం ఎమ్మెల్యే వాసుపల్లి మాట్లాడుతూ నియోజకవర్గంలో వైఎస్సార్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎన్నో ఏళ్ల నుంచి పరిష్కారం కాని జగదాంబ జంక్షన్ నుంచి పాతపోస్టాఫీస్ వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టి ప్రజలకు ఎంతో సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. మాసిపోగు రాజు, పలువురు పార్టీ నాయకులు, జోనల్ కమిషనర్ శివప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సంతోషి, జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు

## పేదలంటే సీఎం జగన్‌కు ఎంతో ప్రేమ


లబ్ధిదారులకు ఇంటి పట్టాలు అందిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి, పద్మావతి

అల్లిపురం : పేదలంటే ముఖ్యమంత్రి జగనన్నకు ఎంతో ప్రేమ అని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. తన 15 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇటువంటి ముఖ్యమంత్రిని చూడలేదని ఎమ్మెల్యే తెలిపారు. 34వ వార్డులోని అచ్చియ్యమ్మపేటలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని వార్డులో ఇంకా మిగిలి ఉన్న 59 మందికి జగనన్న ఇళ్ల పట్టాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్పొరేటర్ తోట పద్మావతి వార్డు అభివృద్ధికి తీవ్రంగా కృషి చేస్తున్నారన్నారు. సుమారు రూ.4 కోట్లతో రోడ్లు, డ్రైనేజీ పనులు చేపట్టారన్నారు. పద్మావతి కార్పొరేటర్‌గా గెలిచిన తర్వాత వార్డులో యూపీహెచ్‌సీ నిర్మాణం చేపట్టి ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకు వచ్చారన్నారు. వార్డు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు లింగం శ్రీను, లండా రమణ, సచివాలయ కన్వీనర్లు, అనిల్‌కుమార్, సూరిబాబు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## మర్యాదపూర్వక కలయిక


మేయర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అదనపు కమిషనర్

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ అదనపు కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన కేఎస్ విశ్వనాథన్ గురువారం నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జాయింట్ కలెక్టర్‌గా నగరానికి ఎన్నో సేవలు అందించి, జీవీఎంసీ అదనపు కమిషనర్‌గా బదిలీపై వచ్చిన విశ్వనాథన్‌ను మేయర్ అభినందిస్తూ నగర ప్రజలకు మెరుగైన సేవలందించాలని కోరారు.

## ఉత్తమ సేవలందించిన 'ద్విభాష్యం'కు వీడ్కోలు

మహారాణిపేట : రెవెన్యూ శాఖలో విధులు నిర్వర్తించి రిటైర్ అయిన ద్విభాష్యం సూర్యనారాయణ మూర్తికి గురువారం కలెక్టరేట్‌లో ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు త్రినాథరావు, జేఏసీ అమరావతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్తి నాగేశ్వరరావు తదితరులు వీడ్కోలు పలికారు.

## జోరుగా కొత్త పింఛన్ల పంపిణీ


పింఛన్ అందజేస్తున్న బొర్రా విజయలక్ష్మి


కేజీహెచ్‌లో వెంకటరావుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ఉషశ్రీ


లబ్ధిదారుకు కొత్త పింఛన్ అందజేస్తున్న పాల శ్రీహరిరెడ్డి

అల్లిపురం : ఒకటో తేదీ కావడంతో గురువారం వేకువ జామునే లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ జరిగింది. నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ బొర్రా విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు బొర్రా శ్రీనివాసరెడ్డి వలంటీర్ రాణితో కలిసి ఒంటరి మహిళ పింఛన్ లబ్ధిదారుకు అందజేశారు. 33వ వార్డు పార్టీ సీనియర్ నాయకుడు, టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుడు పాల శ్రీహరిరెడ్డి, నీలాపు అయ్యప్పరెడ్డి, యల్లంకి చిన్నమ్మలు కుమ్మరవీధి సచివాలయం వద్ద కొత్తగా మంజూరైన పింఛన్‌ను లబ్ధిదారుకు అందజేశారు. కార్యక్రమంలో వారితో పాటు సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు వై.ఝాన్సీ, పి.హేమలత, కె. దేవి, కిరణ్మయి పాల్గొన్నారు.

**కేజీహెచ్‌కు వెళ్లి పింఛన్ అందజేత..**

మహారాణిపేట : కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బుచ్చిరాజుపాలేనికి చెందిన పేద రోగి రావాడ వెంకటరావుకు వలంటీర్ ఉషశ్రీ గురువారం పింఛను అందజేశారు. సచివాలయం ఇన్‌చార్జి ఆదేశాల మేరకు కేజీహెచ్‌కు వెళ్లి వెంకటరావుకు పింఛన్ అందజేసినట్టు వలంటీర్ తెలిపారు.

## ఎమ్మెల్యే వాసుపల్లి ఔదార్యం


34వ వార్డులో బాధితురాలికి ఆర్థిక సాయం చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

అల్లిపురం : ప్రజాసేవలోనే తనకు సంతృప్తి ఉందని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ అన్నారు. గురువారం ఆయన పది మందికి రూ. 5 వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. 38వ వార్డు ఉల్లిపాయల వారివీధి విశ్వబ్రాహ్మణ కులానికి చెందిన నక్క శాంతికుమారికి, బురుజుపేటలోని మందారపు ప్రీతికి, గంగాభక్తుల వారి వీధికి చెందిన పట్నాల శ్రీనుకు, 39వ వార్డు చాగంటి వారి వీధికి చెందిన చావాల లక్ష్మికి, 37వ వార్డు యాతవీధికి చెందిన దాసరి అప్పారావు పెద్దకర్మ నిమిత్తం, 34వ వార్డు నేతాజీనగర్‌కు చెందిన మైలపల్లి ఎల్లాజీకి, కొబ్బరితోటకు చెందిన తోటకూర ఎల్లయ్యమ్మ, అచ్చియ్యమ్మపేటకు చెందిన సంగిరెడ్డి సత్యానారాయణకు, 36వ వార్డు సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీ జె. సన్యాసిరావు కుమార్తె జాస్మిన్ కాలేజీ ఫీజు నిమిత్తం ఆర్థిక సాయం అందజేశారు. ఇలా ఆయన 10 మందికి రూ.5 వేలు చొప్పున, మరో ముగ్గిరికి రూ.500 చొప్పున అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, ఆలయ చైర్మన్లు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, స్టేట్ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మెల్యే వాసుపల్లి జన్మదిన వేడుకలు


మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

జగదాంబ : ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ జన్మదిన వేడుకలు జీవీఎంసీ 35వ వార్డు అధ్యక్షుడు అలపన కనకరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గురువారం దుర్గాలమ్మ గుడి జంక్షన్ వద్ద నిర్వహించిన వేడుకల్లో భారీ కేక్ కట్ చేశారు. అనంతరం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కనకరెడ్డి మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వాసుపల్లిని మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపించుకుని జగనన్నకు కానుకగా ఇస్తామన్నారు. సీఎం జగన్‌ను విమర్శించే స్థాయి కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావుకు లేదని కనకరెడ్డి దుయ్యబట్టారు.

## ద్రోణంరాజు శ్రీనివాస్‌కు ఘన నివాళి


ద్రోణంరాజుకు నివాళులు అర్పిస్తున్న నాయకులు

జగదాంబ : ప్రజలతో మమేకం అయిన నేత దివంగత ద్రోణంరాజు శ్రీనివాస్ అని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. గురువారం వివేకానంద స్వచ్ఛంద సంస్థలో నిర్వహించిన ద్రోణంరాజు శ్రీనివాస్ జయంతి కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే వాసుపల్లి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు పాల్గొన్నారు. అనంతరం మెగా రక్తదానం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. గ్రంథాలయ చైర్మన్ కొండా రాజీవ్‌గాంధీ, మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు పేడాడ రమణికుమారి, షేక్ కార్పొరేషన్ చైర్మన్ షబీరా బేగం, కొల్లి సింహాచలం పాల్గొన్నారు.

## బీసీలను గుర్తించే రాజకీయ పార్టీలకే మద్దతు


ఐక్యత చాటుతున్న బీసీ సంఘం నాయకులు

డాబాగార్డెన్స్: బీసీలను గుర్తించే రాజకీయ పార్టీలకే తమ మద్దతు ఉంటుందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకర్రావు తెలిపారు. నగరంలోని బీసీ సంఘ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేవలం ఎన్నికల సమయంలో బీసీలను వాడుకుంటున్న ఆయా రాజకీయ పార్టీలకు తగిన బుద్ధి చెప్పేలా, రాజ్యాధికారమే లక్ష్యంగా అన్ని బీసీ సంఘాలు ఏకతాటిపైకి వచ్చి, రాబోయే ఎన్నికల్లో సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. జనాభాలో 50 శాతం పైగా ఉన్న బీసీలు, దళిత, ఆదివాసీ, మైనార్టీ ప్రజలను నమ్ముకుంటే బీసీ నాయకులకు ఆత్మగౌరవం, రాజ్యాధికారం, సామాజిక న్యాయం లభిస్తుందనే విషయాన్ని గుర్తించాలన్నారు. రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో బీసీలకు ఏ రాజకీయ పార్టీ సముచిత స్థానం కల్పించి పదవులు కేటాయిస్తుందో వారికే మద్దతు తెలపాలని కోరారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, ఉత్తరాంధ్ర పొలిటికల్ జేఏసీ కన్వీనర్ గొర్లె శ్రీనివాస నాయుడు, కర్రి ధనుంజయనాయుడు, పల్ల రమణ, కామన వెంకట సుబ్బారావు, ప్రసాద్, పల్లి శ్రీనివాస నాయుడు, సంసద్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.